సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం | 30 | జూలై | 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు వేమగిరికి చెందిన నూరపురెడ్డి జానకిరామయ్య శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2600, మధ్య డెల్టాకు 1500, పశ్చిమ డెల్టాకు 3000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

విరాళం అందజేత



అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మంథా రాంబాబు దంపతులు(ఖరగ్‌పూర్) రూ.2 లక్షల విరాళాన్ని శనివారం రిసప్షన్ సూపరిండెంట్ కాపారపు శివకు అందచేశారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాక



మంత్రి మేరుగు నాగర్జున

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను నుంచి మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3 గంటలకు రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు సాంఘిక సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న పలు అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. సోషల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు, పాఠశాలల డీసీఓ,ప్రిన్సిపాల్స్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీక్షకు హాజరవుతారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బయలుదేరి గుంటూరు వెళతారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిట లాడింది. అధిక శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఆలయప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు, స్వామివారి ఆలయం భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు అధికారులు తెలిపారు. సత్యదేవుడిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జీజీహెచ్‌లో చీలిక పెదవి శస్త్రచికిత్సలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో శనివారం చీలిక పెదవికి శస్త్రచికిత్సలు జరిగాయి. మలిదశలో భాగంగా శుక్రవారం మొదలైన ఈ చికిత్సలు ఆదివారం వరకు కొనసాగనున్నాయి. శుక్రవారం స్క్రీనింగ్ ద్వారా ఎంపిక చేసిన 18 మంది బాలలకు శనివారం శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆదివారం మరో 15 మందికి చీలిక పెదవి శస్త్రచికిత్సలు జరగనున్నాయి. మిషన్ స్మైల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ప్రారంభించారు. అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ శస్త్రచికిత్సలకు సర్జికల్ టీం లీడర్‌గా డాక్టర్ ప్రభాకర్ వ్యవహరించారు. ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు డాక్టర్ రత్న, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ ప్రభాకర్ అనస్థీషియా నిపుణులు డాక్టర్ సతీష్, డాక్టర్ శృతి, డాక్టర్ బ్యూలా మూడు బృందాలుగా ఏర్పడి 18 మంది బాలలకు ఈ చికిత్సలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉగ్రరూపం



ఉగ్రమైనది

- మహోగ్రరూపం దాల్చుతున్న వరద
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం

ధవళేశ్వరం/కొవ్వూరు: గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరద ఉప్పొంగుతోంది. లంక గ్రామాల గుండెల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాలతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్దకు శనివారం భారీగా వరద నీరు చేరుతోంది. రాత్రి 7గంటలకు బ్యారేజ్ వద్ద 15 అడుగులకు నీటి మట్టం చేరింది. 175 గేట్లను పూర్తిగా పైకి లేపి 14,73,762 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. రెండవ ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. ఉదయం 6గంటలకు 14.20అడుగులు ఉన్న నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంటకు 14.70 అడుగులకు చేరింది. మరింత పెరుగుతూ రాత్రి 7గంటలకు 15 అడుగులకు చేరింది. మరోపక్క భద్రాచలంలో శనివారం రాత్రి 55.60అడుగులకు నీటి మట్టం చేరింది. అక్కడ మరికొంత పెరిగి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనారు. ధవళేశ్వరం వద్ద సుమారు 16అడుగులకు నీటి మట్టం చేరి తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు కాటన్ బ్యారేజ్ నుంచి 833టీఎంసీల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గత ఏడాది ఇదే రోజు కాటన్ బ్యారేజ్ వద్ద 10.10అడుగు నీటి మట్టం ఉండగా 7,45,739క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. ముప్పు ఉన్న గ్రామాలను గుర్తించి ప్రజలను పునరావాసం శిబిరాలకు తరలించేందుకు ఏర్పాట్లుచేసింది.

శనివారం నీటి ఉధృతి కొనసాగింది ఇలా..

సమయం	నీటి మట్టం (అడుగుల్లో)	మిగులు జలాలు (క్యూసెక్కులు)
ఉదయం 6గంటలకు	14.20	13,40,383
ఉదయం 9గంటలకు	14.50	13,83,537
మధ్యాహ్నం 12గంటలకు	14.70	14,12,523
మధ్యాహ్నం 3గంటలకు	14.80	14,30,202
సాయంత్రం 6గంటలకు	15	14,65,031
రాత్రి 11 గంటలకు	15.10	14,98,040



రాజమహేంద్రవరంలోని మున్సిపల్ కల్యాణమండపంలో వరద బాధితులు

మరో రెండు రోజులు పాటు గోదావరి ఉధృతి

కాళేశ్వరం,పేరూరులలో నీటి ఉధృతి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద నీటి ఉధృతి తగ్గుతున్నప్పటికీ ఆ ప్రభావం ధవళేశ్వరం వద్ద కనిపించేందుకు 18గంటలు పడుతుంది. ధవళేశ్వరం వద్ద మరి కొంత నీటి మట్టం పెరిగి ఆదివారం నిలకడగా కొనసాగి అనంతరం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

వరద ముంపులో వరి పంట

జిల్లాలో గోదావరి వరదలు, అధిక వర్షాల కారణంగా 5,024 ఎకరాల్లో వరి పంట ముంపు బారిన పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సీతానగరం మండలంలో ముంపు తీవ్రత అధికంగా ఉంది. ఈ ఒక్క మండలంలోనే 1,537 ఎకరాల్లో ముంపుబారిన పడింది.



పెరవలి మండలం కాకరపర్రు లంక భూముల్లో గోదావరి వరద ముంపునకు గురైన అరటి పంట



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో సందర్శకుల ప్రవేశాన్ని నిషేధిస్తూ గేట్లు మూసివేత



తాళ్లపూడి మండలంలోని పంట పొలాల్లో చేరిన గోదావరి వరద

సందర్శకుల అనుమతి నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి ఉధృతిని దృష్టిలో పెట్టుకుని నగర పాలక సంస్థ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలో గోదావరి ఘాట్‌లో సందర్శకు అనుమతి నిలిపివేశారు. 156 మందిని అల్కాట్‌తోట నగర పాలక సంస్థ కల్యాణమండపంలో పునరావాస కేంద్రానికి తరలించినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. సీతానగరం మండలం ములకల్లంక వాసులకు సేవలు అందించడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు.

ముంపు బారిన గోష్పాదక్షేత్రం

గోదావరిలో వరదతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం ముంపు బారిన పడింది. క్షేత్రంలో రోడ్లపై రెండుగులు వరద నీరు ప్రవహిస్తోంది. మరో వైపు మద్దూరులంకకు వరదముంపు పొంచి ఉండడంతో ఆర్డీవో ఎస్.మల్లిబాబు శనివారం సందర్శించారు. లోతట్టు ప్రాంతంలోని 15 మత్స్యకార కుటుంబాలను పునరావాసానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మద్దూరు హైస్కూలులో పునరావాసం కోసం బెడ్లు,రూమ్‌లు అందుబాటులో ఉంచామన్నారు. నిడదవోలు,కొవ్వూరు,తాళ్లపూడి, పెరవలి,సీతానగరం తదితర మండలాల్లో లంకభూములు ముంపు బారిన పడ్డాయి. నదీ తీరంలోని ఇసుక ర్యాంపులన్నీ మూతపడ్డాయి. నిడదవోలు,పెరవలి,కొవ్వూరు,తాళ్లపూడి మండలాల పరిధిలో 761 ఎకరాల్లో ఉద్యాన పంటలు ముంపు బారిన పడినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి వి.రాధాకృష్ణ తెలిపారు.

జోడుగుళ్లు అభివృద్ధికి సహకారం

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారంలో ఎంపీ భరత్‌రామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భక్తిభావంతో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సేవలందించాలని ఎంపీ భరత్ రామ్ కోరారు. టి.నగర్‌లోని శ్రీ బాలాత్రిపురసుందరి అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం (జోడుగుళ్లు) కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జరిగింది. పాలకవర్గ చైర్మన్‌గా నిడమర్తి దుర్గా శ్రీనివాస్, సభ్యులుగా యోగమంజునాథ, కే భావన్నారాయణ, పాలటి కోటీశ్వరి, ఆర్ శేఖర్, ఎం.కృష్ణారెడ్డి, ఎస్ అలివేలు మంగ, కే చంద్రమౌళీశ్వరరావులచేత ఎంపీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ దాదాపు 600 సంవత్సరాల చరిత్ర కలిగిన జోడుగుళ్ల ఆలయం ఎంతో పురాతనమైందన్నారు.



విశ్వేశ్వరస్వామిదేవస్థానం నూతన పాలకమండలి సభ్యులతో ఎంపీ మార్గాని భరత్‌రామ్,చందన నాగేశ్వర్, డా.గూడూరి శ్రీనివాస్ తదితరులు

దాతలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. తాను కూడా నిధులు కోరుతూ టీటీడీకి లేఖ రాస్తానని చెప్పారు. వెబ్‌సైట్ తయారు చేసి ఆలయ చరిత్రను పొందుపరచాలని సూచించారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తుల మన్ననలు పొందాలని కొత్త కార్యవర్గాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ ధర్మకర్తల మండలిలో 50 శాతం మహిళలు, 50 శాతం బీసీ, ఎస్టీలు, ఒక నాయీబ్రాహ్మణునికి, కోఆప్షన్ సభ్యునిగా ఆలయ అర్చకునికి అవకాశం కల్పించడం సంతోషమన్నారు. తొలుత ఆలయానికి వచ్చిన ఎంపీ భరత్,చందన నాగేశ్వర్‌లకు పండితులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మిండి నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ రాజమౌళి, అంగాడి సత్యప్రియ, ఆలయ కార్యనిర్వహణాధికారి మోతా శోభారాణి, వైఎస్సార్‌సీపీనేతలు పాల్గొన్నారు.

లంక రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు

పెరవలి: గోదావరి వరద వలన పంటలు కోల్పోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. పెరవలి మండలం ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఖండవల్లి గ్రామాల్లో గోదావరి వరద బాధిత ప్రాంత్రాలను శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గోదావరి కన్వర్‌జెన్సీ అధికారులతో మాట్లాడుతూ వరద ఉధృతంగా ఉందని గట్టుకు ఎటువంటి ఇబ్బందిలేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి కష్టం కలగకుండా చూడాలన్నారు. రైతులతో మాట్లాడుతూ అందరినీ ఆదుకుంటామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. లంకలో దెబ్బతిన్న పంటను వ్యవసాయాధికారులు సర్వే చేసి అంచనాలు తయారు చేస్తారని తెలిపారు. 2022లో వరదల వలన నష్టపోయిన అరటి రైతులకు రూ.2.57 కోట్లు పంట నష్ట పరిహారం అందించామన్నారు. ఇప్పుడు కూడా నష్ట పరిహారం అందుతుందన్నారు. 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను అందిస్తారన్నారు. పెరవలి మండలానికి 10 వేల కిలోల దాణా కేటాయించామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆయన వెంట ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ,తహసీల్దార్ టి రాజ రాజేశ్వరి, ఉద్యాన అధికారి శ్రీనివాస్, నాయకులు కందా వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.



ఖండవల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు

ఆనందరూపా.. గోవిందా..



వాడపల్లి వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 వేల మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి కాలినడకన, అలాగే ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా ఈ ఒక్కరోజే రూ.30,38,694 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. ఆలయం వద్ద ట్రాఫిక్ ఎక్కువ కావడంతో ఎస్సై కిరణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

రైతులకు పంట నష్ట పరిహారం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హామీ

దేవరపల్లి: భారీ వర్షాలకు దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో వరి చేలు దెబ్బతిన్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. శనివారం గౌరీపట్నంలో కొవ్వాడకాలువ పొంగడం వల్ల నీటమునిగిన వరి చేలను ఆయన పరిశీలించారు. గ్రామం నుంచి ట్రాక్టర్‌పై నీటమునిగిన పొలాలకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా ఖరీఫ్ సీజన్‌లో గోపాలపురం మండలం చిట్యాల, వెంకటాయపాలెం, దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలోని వందలాది ఎకరాల వరిచేలు కొవ్వాడ వరద ముంపు బారిన పడుతున్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల్లో సుమారు 150 ఎకరాలు, గౌరీపట్నంలో దాదాపు 410 ఎకరాల్లో వరిచేలు దెబ్బతిన్నట్టు తెలిపారు. వ్యవసాయాధికారులు పంట నష్టం నమోదు చేస్తున్నారన్నారు. సుమారు రూ.3.50 కోట్ల మేర పంట దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారని చెప్పారు. అధికారుల నివేదిక ప్రకారం రైతులకు పంట నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కొవ్వాడ కాలువ శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తాననితెలిపారు. దాదాపు పదిరోజుల నుంచి వరిచేలు నీటిలో ఉన్నందున దుప్పు కుళ్లిపోతుందని రైతులు ఆయనకు వివరించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుతరావు, వైస్ సర్పంచ్ సాదే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, రైతులు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

క్లుప్తంగా

జార్జియా నుంచి ఆలమూరుకు వైద్య విద్యార్థి మృతదేహం


సిడిగం హేమంత్ అశ్విన్ ఆకాష్ (ఫైల్)

ఆలమూరు: జార్జియా దేశంలో ఈ నెల 16న అదృశ్యమైన వైద్య విద్యార్థి సిడిగం హేమంత్ అశ్విన్ ఆకాష్ (21) మృతి చెందాడు. అతని మృతదేహాన్ని స్వగ్రామమైన ఆలమూరుకు శనివారం తీసుకొచ్చి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన సత్యనారాయణ (నాయుడు) మాత్రం స్థానిక రంగా సెంటర్‌లో నివాసం ఉంటున్నారు. ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన రెండో కుమారుడైన హేమంత్‌ను 2022లో హైదరాబాద్‌కు చెందిన వీసోర్స్ కన్సల్టెన్సీ ద్వారా జార్జియా దేశంలోని ఇల్లియా స్టేట్ గవర్నమెంట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివేందుకు చేర్పించారు. అప్పటి నుంచి కన్సల్టెన్సీ ఏర్పాటు చేసిన హాస్టల్‌లో ఉంటూ చదువుకుని సెలవులపై తరచూ స్వగ్రామం ఆలమూరుకు హేమంత్ వస్తుండేవాడు. ఈ నెల 16న తన స్నేహితులతో కలసి ఆ దేశంలో బీచ్ వద్దకు స్నానానికి వెళ్లాడు. అదే సమయంలో ఎగిసి పడిన కెరటాల్లో ముగ్గురు విద్యార్థులు చిక్కుకున్నారు. తీరానికి దగ్గరగా ఉన్న తన స్నేహితులిద్దరిని స్థానికులు రక్షించగా, హేమంత్‌ను రక్షించడానికి అవకాశం లేకుండా పోయింది. మూడు రోజుల అనంతరం హేమంత్ మృతదేహం లభించింది. విదేశ మంత్రిత్వశాఖ, వీ సోర్స్ కన్సల్టెన్సీ సహకారంతో హేమంత్ మృతదేహాన్ని శుక్రవారం దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆలమూరుకు తరలించారు.

ఏడు వారాల వెంకన్న

- ఆధ్యాత్మిక కేంద్రంగా వాడపల్లి
- భక్తులతో అలరారుతున్న క్షేత్రం
- సొంత విమానాల్లో వచ్చి శ్రీవారి దర్శనం

ఆత్రేయపురం: గోవిందా హరి గోవిందా.. గోకుల నందన గోవిందా.. అంటూ బ్రహ్మాండ నాయకుడిని భక్తజనం మనసారా స్మరిస్తోంది. ఆ ఏడు వారాల స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తోంది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతి పొందిన వాడపల్లి క్షేత్రం దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది.. రోజు రోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతోంది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన వేంకటేశ్వరుని క్షేత్రం అభివృద్ధిలో ప్రత్యేకతను చాటుతోంది. ఏడు వారాలూ వాడపల్లి వెంకన్నను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి శనివారం వేలాదిగా భక్తజనం తరలివస్తోంది. ప్రతి వారం సుమారు 30 వేల నుంచి 50 వేల మంది వరకూ వాడపల్లి వెంకన్నను దర్శించుకుంటున్నారు. స్వామివారి కల్యాణోత్సవాల వేళ లక్షకు పైగా భక్తులు వస్తున్నారు.

అప్పట్లో అలా.. నేడు మురిసేలా

దశాబ్ద కాలం కిందట వాడపల్లి క్షేత్రానికి భక్తుల రద్దీ అంతగా ఉండేది కాదు. ఏడువారాల నోము ఆచరించే భక్తులు ఆలయం లోపలే ప్రదక్షిణలు చేసేవారు. ప్రస్తుతం భక్తుల రద్దీ పెరగడంతో ఆలయాన్ని విస్తరించి, బయట భక్తులు ఏడు సార్లు ప్రదక్షిణలు చేసే సౌకర్యం కల్పించారు. అప్పట్లో శనివారాలు సుమారు 4 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని ఆలయం పరిసరాల్లో పెట్టేవారు. ప్రస్తుతం రూ.5.50 కోట్లతో నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పుడు సుమారు 20 వేల మందికి అన్న ప్రసాదాన్ని ఆ సత్రం వద్ద వడ్డిస్తున్నారు. మామూలు రోజుల్లో 2 వేల నుంచి 5 వేల మంది వరకూ ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల కోసం భారీగా పార్కింగ్ స్థలాన్ని


విరాళం అందజేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వాహకులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు (ఫైల్)

ఏర్పాటు చేశారు. ఇది శనివారాలు కిక్కిరిసి ఉంటోంది. అంతేకాకుండా ఆలయానికి సరికొత్త రూపును తెచ్చారు. పదేళ్ల కిందట ఏడాదికి రూ.లక్షల్లో ఉన్న ఆదాయం నేడు రూ.13 కోట్లకు చేరింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజుతో పాటు కమిటీ సభ్యుల సహకారంతో దేవస్థానం అభివృద్ధిలో ముందంజలో నిలుస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు సొంత విమానాల్లో మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి కారుల్లో వాడపల్లికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటున్నారు. గతంలో క్షేత్రానికి 20 బస్సులు తిరుగుతుండగా నేడు 124


వాడపల్లి క్షేత్రంలో భక్తుల రద్దీ

బస్సుల వరకూ వస్తున్నాయి. ఇందులో పది ఆత్రేయపురం– రావులపాలెం సర్వీసులు.

అభివృద్ధి దివ్యం

దేవస్థానం వద్ద వకులమాత అన్నప్రసాద భవనం రూ.5.50 కోట్లతో పూర్తి సౌకర్యాలతో రూపుదిద్దుకుంటోంది. ఇక్కడ ఒకేసారి 2,500 మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాకార మండపాన్ని రూ.3.75 కోట్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాయి. తిరుమల దేవస్థానం తరహాలో వెంకన్నకు తెప్పోత్సవం నిర్వహణకు రూ.2.50 కోట్లతో కోనేరును అభివృద్ధి చేయనున్నారు. వాడపల్లికి కాలినడకన వచ్చే భక్తుల విశ్రాంతికి, సామూహిక వివాహాలు, ఉపనయనాలు జరిపేందుకు వీలుగా రూ.2.60 కోట్లతో మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు. రూ.65 లక్షలతో స్వామివారి శాశ్వత వార్షిక కల్యాణ వేదికను రావులపాలేనికి చెందిన కాంట్రాక్టర్లు నిర్మించారు. భక్తుల కోసం టాయిలెట్లను ఆలయ పరిసర ప్రాంతాల్లో బస్టాండ్ వద్ద నిర్మించారు. రూ.22 లక్షలతో గంటకు పది వేల లీటర్ల నీరు శుద్ధి చేసే వాటర్ ప్లాంట్ నిర్మించారు. వాహనాలు నిలిపేందుకు రూ.1.65 కోట్లతో పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు.

స్వామి సేవలో దాతలెందరో..

స్వామివారి సేవలో దాతలెందరో భాగస్వాములవుతున్నారు. ఇటీవల నిత్యాన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వాహకులు రూ.40 లక్షలు, ఆత్రేయపురం వాసి హైదరాబాద్‌లో స్థిరపడిన పీఆర్‌ఆర్ డెవలపర్స్ కంపెనీ అధినేత పాతపాటి రామాంజనేయరాజు రూ.10 లక్షలు సమర్పించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలమూరుకు చెందిన బెంగళూరు, హైదరాబాద్‌లలో స్థిరపడిన మంతెన ఇన్‌ఫ్రాసోల్ అధినేత మంతెన శ్రీనివాసరాజు అన్నదాన భవనానికి రూ.50 లక్షలు, నిత్యాన్నదాన పథకానికి రూ.50 లక్షలు, శివాలయానికి రూ.18 లక్షలు ఇవ్వనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఎక్కడెక్కడి నుంచో..



వాడపల్లి క్షేత్రం విశిష్టత తెలుసుకుని ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తున్నారు. రోజు రోజుకూ ఆలయానికి రద్దీ పెరుగుతోంది. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో దేవస్థానాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం. భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం.

–రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ కమిటీ చైర్మన్, వాడపల్లి

ఆదాయం పెరిగింది



నాలుగేళ్ల కిందట హుండీల ఆదాయం రూ.9 లక్షలు వచ్చేది. నేడు సుమారు రూ.60 లక్షల వరకూ వస్తోంది. దేవస్థానం అన్ని విభాగాల ద్వారా ఏటా రూ.13 కోట్ల మేర సమకూరుతోంది. ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం. క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ ఈఓ

ఆరేళ్ల చిన్నారి అదృశ్యం

నిమిషాల్లోనే కనుగొన్న పోలీసులు


శ్రీదేవిని ఎత్తుకుని తీసుకు వస్తున్న జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: ఆరేళ్ల చిన్నారి అదృశ్యం కాగా నిమిషాల వ్యవధిలో పోలీసులు ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ కథనం.. స్థానిక పద్మనాభనగర్ కాలనీకి చెందిన రేష్మిత శ్రీదేవి (6) ఆడుకుంటూ దారితప్పి కాలనీకి దూరంగా రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. ఆమె కనిపించకపోవడంతో కంగారు పడిన పాప బాబాయి గంగాధర్ 100 నంబర్‌కు ఫోన్ చేశారు. దీంతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జగ్గంపేట పోలీసులను అప్రమత్తం చేశారు. వెంటనే ఎస్సై విద్యాసాగర్ తన సిబ్బందితో రంగంలోకి దిగి కాలనీ మొత్తం జల్లెడ పట్టి పాప ఆచూకీ తెలుసుకున్నారు. ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రులు తోట రామారావు, సిరిమతికి అప్పగించారు. వర్షాకాలం నేపథ్యంలో చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్సై సూచించారు. విద్యుత్తు స్తంభాలు, నీటిగుంటలు ఉన్న ప్రాంతాలకు పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

పుంగనూరు దూడ జననం

ఆలమూరు: మండలం జొన్నాడలో ఆదర్శ పాడిరైతు అనె వెంకన్నకు చెందిన ఒంగోలు జాతి ఆవుకు అరుదైన పుంగనూరు దూడ జన్మించింది. తన పశువుల మకాంలో ఉన్న ఒంగోలు జాతి ఆవుకు గతంలో పుంగనూరు సెమన్‌తో క్రాసింగ్ చేయించారు. దీంతో ఆ ఒంగోలు జాతి ఆవు ఐదో విడత పెయ్యి దూడకు జన్మనిచ్చింది.


వెండి తులసీదళ హారాన్ని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావుకు అందిస్తున్న భక్తులు

శ్రీవారికి వెండి తులసీదళ హారం సమర్పణ

దేవరపల్లి: స్థానికంగా కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రూ.1.60 లక్షల విలువైన వెండి తులసీదళ హారాన్ని మండలంలోని దుద్దుకూరుకు చెందిన ముళ్లపూడి సత్యనారాయణ, వెంకటరమణ దంపతులు శనివారం సమర్పించారు. దీనిని ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులకు అందజేశారు. దాత దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

లేరా తాతా... నన్ను చూడు

- మనవడి మృతదేహం వద్ద ఓ వృద్ధుడి రోదన
- లారీ ఢీకొనడంతో యువకుడి మృతి


భరత్ ప్రేమ్‌కిశోర్ (ఫైల్)

గండేపల్లి: లేరా తాతా లే.. సరదాగా బయటకు వెళ్దాం కళ్లు తెరూ.. నిన్ను ఇలా చూడలేకపోతున్నాను.. అంటూ రోడ్డు ప్రమాదంలో గాయపడి స్పృహ లేకుండా పడిఉన్న మనవడి వద్ద ఓ వృద్ధుడి రోదన చూపరులను కంటతడి పెట్టించింది. మల్లేపల్లి శివారులో ఈ ఘటన జరిగింది. శనివారం లారీ ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనతో నీలాద్రిరావుపేట, మల్లేపల్లి గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ కథనం


మృతదేహం వద్ద రోదిస్తున్న అమ్మమ్మ, బంధువులు

ప్రకారం.. నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన దండు లక్ష్మికి భరత్ ప్రేమ్‌కిశోర్ (15) ఏకైక సంతానం. కుమారుడిని ఆమె అల్లారుముద్దుగా చూసుకుంటోంది. లక్ష్మి భర్త రాంబాబు కొన్నేళ్ల కిందటే మృతి చెందాడు. దీంతో భరత్ ప్రేమ్‌కిశోర్ మల్లేపల్లిలోని తాత, అమ్మమ్మలైన సిద్దా రామకృష్ణ, గంగావతి వద్ద ఉంటూ తొమ్మిదో తరగతి చదువుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం లక్ష్మి తన పుట్టిల్లు మల్లేపల్లికి వచ్చింది. శనివారం సెలవు కావడంతో ఉదయం తన కుమారుడితో పాటు నీలాద్రిరావుపేట వెళ్లేందుకు సిద్ధపడగా ఇంతలో బయటకు వెళ్లి వస్తానంటూ ప్రేమ్‌కిశోర్ వెళ్లాడు. మోటార్ సైకిల్‌పై గండేపల్లి వైపు వెళ్తున్న ఆ యువకుడిని మల్లేపల్లి శివారు కరుణకుమార్ దాబా వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడి తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా, ఈ సమాచారం తెలియడంతో మృతుడి తల్లి, తాత అక్కడికి వచ్చారు. లేవరా కిశోర్ అంటూ తట్టి లేపుతున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వెంటనే గండేపల్లి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా రాజానగరం జీఎస్‌ఎల్ వద్దకు వచ్చేసరికి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి తాత రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ జీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. లారీ ఢీకొని ఆపకుండా వెళ్లిపోయిందని, ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. ప్రమాద స్థలంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో రోడ్డు సేఫ్టీ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంలో దెబ్బతిన్న మోటార్ సైకిల్‌ను పక్కకు తీయించారు.

ఆ కుటుంబానికి దిక్కెవరు..

ప్రేమ్‌కిశోర్ తల్లి లక్ష్మి నీలాద్రిరావుపేటలో ఆశగా


ప్రమాద స్థలం వద్ద మనవడిని చూసి రోదిస్తున్న తాత రామకృష్ణ

పనిచేస్తుండేది. భర్త రాంబాబు మృతి చెందడంతో అప్పటి నుంచి మనోధైర్యంతో ఉంటూ కొడుకు ఆలనాపాలన చూసుకుంటుంది. ఇటీవల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ ఏఎన్‌ఎంగా ఎంపికై విధులు నిర్వర్తిస్తుంది. ఆ కుటుంబంలో అనుకోని ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇటీవల జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతిలో ప్రేమ్‌కిశోర్ చేరాడు. బాగా చదువుకుని ప్రయోజకుడై, కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడని అనుకున్న వారి ఆశలు తీరకుండానే ఇలా జరిగిందని మృతుడి మేనమామ లోవరాజు తెలిపారు.